# రైతు సంక్షేమమే ధ్యేయం

## వచ్చే ఎన్నికల్లో అదే మా ప్రధాన ఎజెండా ☆ విజయవాడ భేటీ దేశ రాజకీయాలకు మలుపు

## వచ్చేనెల్లో మరో రైతు సదస్సు ☆ యూఎన్‌పీయే నేతల ఉద్ఘాటన


విజయవాడ నుంచి
న్యూస్‌టుడే ప్రత్యేక ప్రతినిధి


"రైతుల సంక్షేమమే కార్యక్రమంగా విజయవాడలో మేం తీసుకున్న నిర్ణయాలు దేశ రాజకీయాలను మారుస్తాయి. సరిగ్గా 23 ఏళ్ల క్రితం విజయవాడ వేదికగా ఇది జరిగింది. నాడు కాంగ్రెసేతర పక్షాల కూటమి జాతీయ రాజకీయాలను మలుపుతిప్పింది. చరిత్ర మళ్లీ పునరావృతం కాబోతోంది"

***- విజయవాడలో యూఎన్‌పీయే నేతల ఉద్ఘాటన ఇది.***

తెదేపా అధినేత, యూఎన్‌పీయే సంయోజకుడు(కన్వీనర్) చంద్రబాబు నాయకత్వంలో శనివారం విజయవాడలో ఆ కూటమి భాగస్వామ్య పక్షాల సదస్సు జరిగింది. 'రైతు గర్జన' జరగడానికి ముందు చోటు చేసుకున్న ఈ భేటీలో సమాజ్‌వాదీ పక్ష నేతలు ములాయంసింగ్ యాదవ్, అమర్‌సింగ్, నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా, జార్ఖండ్ నేత బాబూ లాల్ మరాండీ, భారత జాతీయ లోక్‌దళ్ అధ్యక్షుడు ఓం ప్రకాష్ చౌటాలా, అసోం గణపరిషత్ అధినేత బృందావన్ గోస్వామిలతో పాటు తెలుగుదేశం ముఖ్యనేతలు ఎర్రన్నాయుడు, దేవేందర్ గౌడ్ పాల్గొన్నారు. రెండు గంటలపాటు జరిగిన ఈ సమావేశ వివరాలను నేతలు సంయుక్తంగా విలేకరులకు వివరించారు. తొలుత ములాయం, ఆనక చంద్రబాబు, అమర్‌సింగ్, ఫరూక్, చౌటాలాలు విలేకర్లతో మాట్లాడారు. రైతుల సంక్షేమమే ప్రధానధ్యేయంగా యూఎన్‌పీయే ముందుకు నడుస్తుందని వారు ప్రకటించారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో దీన్నే ప్రధాన ఎజెండాగా చేసి తీరతామన్నారు. క్వింటాల్ వరికి రూ.వేయితో పాటు పంటలన్నింటికీ సరైన మద్దతు ధర కల్పించి కర్షకులను ఆదుకోవాలని కేంద్రాన్ని కోరారు. వ్యవసాయదార్ల సమస్యలపై డిసెంబరు నెలమధ్యలో మరో సదస్సు జరపనున్నట్లు తెలిపారు. రైతు సంఘాలు, వ్యవసాయ శాస్త్రవేత్తలను దీనికి ఆహ్వానించి, రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు అవసరమైన సూచనలను కేంద్రానికి తమ కూటమి చేస్తుందని చెప్పారు. విజయవాడ రైతు గర్జన మాదిరి ప్రదర్శన, బహిరంగ సభలను తమ కూటమి దేశవ్యాప్తంగా నిర్వహిస్తుందన్నారు. జనవరిలో జైపూర్‌లో చౌటాలా నేతృత్వంలోనూ, ఫిబ్రవరి ఆరున రాంచీలో మరాండీ నాయకత్వంలోనూ ఈ సభలు ఉంటాయని వెల్లడించారు.

### రైతును మరిస్తే పెను ప్రమాదం: బాబు

దేశ చరిత్రలో మున్నెన్నడూ లేని రీతిలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని చంద్రబాబు అన్నారు. సర్కారు అపసవ్య విధానాల కారణంగా రైతులు రోజురోజుకూ అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారని చెప్పారు. కర్షకుల ఆత్మహత్యలూ పెరిగిపోతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే కర్షకులు క్రమేపీ వ్యవసాయానికి దూరమవుతారని, తద్వారా దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పడిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పంటలకు సరైన మద్దతు ధర ఇవ్వడం, వ్యవసాయ రంగానికి మరిన్ని రాయితీలు ఇవ్వడమే దీనికి పరిష్కారమని సూచించారు.

### ఎన్టీఆర్ గుర్తుకొస్తున్నారు: ఫరూక్ అబ్దుల్లా

సరిగ్గా 23 ఏళ్ల క్రితం ఎన్టీఆర్ నాయకత్వంలో కాంగ్రెసేతర పక్షాల భేటీ విజవాడలో జరిగిందని ఫరూక్ అబ్దుల్లా గుర్తు చేసుకున్నారు. మళ్లీ అలాంటి భేటీకి తాను విజయవాడ రావడం ఆనందాన్ని కలిగిస్తోందని చెప్పారు. ప్రాంతీయ పార్టీలే దేశ పురోగతికి దోహదపడతాయని, భవిష్యత్తు వాటిదేనని ఉద్ఘాటించారు.

### విపక్షాలపై దాడులు: ములాయం

కాంగ్రెసేతర రాష్ట్రాల్లో విపక్షాలపై దాడులు చేసే సంస్కృతికి యూపీఏ కూటమి తెర తీసిందని ములాయం ఆరోపించారు. దేశంలో శాంతిభద్రతలు పూర్తిగా కొరవడ్డాయని, ఉగ్రవాద కార్యకలాపాలు పెచ్చు మీరాయని చెప్పారు. చంద్రబాబు సహా విపక్ష నేతల భద్రతపై కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని అమర్‌సింగ్ ధ్వజమెత్తారు.

### వామపక్షాలు దూరం

రైతు గర్జనకు వామపక్షాలు హాజరు కాలేదు. అణు ఒప్పందంపై చర్చలు ఉన్న కారణంగా సీపీఎం ఈ సభకు రావడం లేదని చంద్రబాబే తొలుత స్పష్టం చేశారు. సీపీఐ రైతు సంఘం జాతీయ అధ్యక్షుడు అతుల్ కుమార్ అంజన్ వస్తారనుకున్నారు. ఆయనా రాలేదు. యూఎన్‌పీయేతో వామపక్షాలూ జత కడతాయా? అని విలేకర్లు అడగ్గా... చౌటాలా బదులిస్తూ, "మాది పూర్తిగా ప్రాంతీయ పక్షాల కూటమి. రైతు సమస్యలు, సామాన్యుల వెతలే కార్యక్రమంగా మేం ముందుకు నడుస్తున్నాం. కింది స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు మాకు తెలిసినంతగా జాతీయ పక్షాలకు తెలీదు. జాతీయ పక్షాలు ఢిల్లీలో కూర్చొని నిర్ణయాలు తీసుకుంటాయి" అని నవ్వుతూ బదులిచ్చారు. ఇంతలో ములాయం అందుకుంటూ, "వామపక్షాలు మాకు మంచి మిత్రులు. 1967 నుంచీ వారితో మాకు దోస్తీ ఉంది. ఇప్పటికీ మేం వామపక్షాలతో కలిసే నడుస్తున్నాం" అన్నారు. యూఎన్‌పీయే భేటీలకు జయలలిత గైర్హాజరవుతున్న వైనంపై నేతలు సూటిగా స్పందించలేదు.